ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
గురువారం 23 అక్టోబరు 2025

ఎరువు బరువు



అన్నదాతలను ఆదుకుంటాం.. వారికి ఇబ్బందుల్లేకుండా చూస్తాం.. రైతు సంక్షేమమే లక్ష్యం.. ఇవన్నీ నేతల మాటలు. కాగితాలకే పరిమితమవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో మాత్రం కర్షకుడికి ప్రభుత్వాలే కష్టాలను తెచ్చి పెడుతున్నాయి. ఎరువుల తయారీ సంస్థల యాజమాన్యాలు విజ్ఞప్తి చేసిందే తడవుగా ధరలు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇదే రైతుల నడ్డి విరుస్తోంది. ఇప్పటికే అతివృష్టి, నకిలీ మందులు లాంటి ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న రైతుల నెత్తిపై మరో పిడుగు పడింది. ఎరువుల ధరలు అమాంతం పెరగనున్నాయి. ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు ధర పెరిగే అవకాశముంది.

- 50 కిలోల ఎరువు బస్తాకు రూ.50 నుంచి రూ.100 పెంపు
- ధరలు పెంచేందుకు తయారీ సంస్థ విజ్ఞప్తి
- పచ్చజెండా ఊపిన కేంద్ర ప్రభుత్వం?
- లబోదిబోమంటున్న రైతాంగం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రెండుసార్లు ఎరువుల ధరలను తయారీ సంస్థ యజమానులు పెంచారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లోనూ వాటి ధరలను పెంచేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కేంద్రానికి విజ్ఞప్తి చేయగా పచ్చజెండా ఊపినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే కాంప్లెక్స్ ఎరువుల ధరలు తడిసి మోపెడవుతున్నాయని, ఒక బస్తా కాంప్లెక్స్ ఎరువు కొనాలంటే రూ.2వేలకు చేరిపోతోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచుకోవడానికి తయారీదారులకు అనుమతి ఇచ్చినా రైతులు ఎక్కువగా ఉపయోగించే యూరియాతో పాటు డీఏపీ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇవ్వలేదని తెలిసిందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.



ముడిసరుకు ఖర్చు పెరిగిందని..

పెరిగిన ధరల వివరాలు ఇంకా తమకు అందలేదని కర్నూలు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటికే డీలర్ల వద్ద పాత ధరలకు సంబంధించిన నిల్వలే ఉన్నాయి. వాటిని పాత ధరలకే విక్రయించాల్సి ఉంటుంది. కాంప్లెక్స్ ఎరువుల తయారీకి వాడే ముడిసరుకులు, ఫాస్పరిక్ ఆమ్లం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో అనూహ్యంగా పెరగడం వల్లే వాటి ధరలను పెంచేందుకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, అనుమతులివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ఇటీవల ఎరువుల తయారీ యాజమాన్యాలు వినతి పత్రం అందించినట్లు స్థానిక డీలర్లు తెలిపారు.



తమకు సమాచారం రాలేదు

ఎరువుల ధరల పెంపుపై జిల్లా వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మిని వివరణ కోరగా.. కాంప్లెక్స్ ఎరువుల పెంపుపై తమకు ఎలాంటి సమాచారం రాలేదన్నారు. ఇప్పుడు నిల్వ ఉన్న ఎరువులకు తప్పనిసరిగా పాత ధరలకే రైతులకు అమ్మాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల కష్ట నష్టాలను..

ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలో సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి పంటలు అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి. రైతులు అపారనష్టం చెందారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో సాగవుతున్న పత్తి పంటకు తెగుళ్ల సోకి పెట్టుబడి కూడా చేతికందలేదు. రైతుల కష్టనష్టాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కాంప్లెక్స్ ఎరువుల కంపెనీల యజమానులు వాటి ధరలను పెంచేందుకు నిర్ణయించడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందాన రైతుల పరిస్థితి తయారైంది. 50 కిలోల ఎరువు బస్తాకు రూ.50 నుంచి రూ.100ల దాకా పెంచుతున్నట్లు సమాచారాన్ని ఎరువుల తయారీ కంపెనీలు నమూనా బస్తాల పోస్టర్లను డీలర్లకు పంపాయి. మరో రెండు నెలల వ్యవధిలో ఎరువుల ధరలు పెరగడం ఇది రెండోసారి అవుతుంది.

50 కిలోల ఎరువుల ధరలు ఇలా

ఎరువుల పేరు	పాత ధర (రూ.లలో)	పెరిగిన ధర (రూ.లలో)	వ్యత్యాసం
20-20-013	రూ.1,350	రూ.1,450	రూ.100
10-26-26	రూ.1,800	రూ.1,900	రూ.100
14-35-14	రూ.1,850	రూ.1,900	రూ.50
15-15-15-09	రూ.1,600	రూ.1,650	రూ.50
16-16-16	రూ.1,600	రూ.1,650	రూ.50
24-24-0	రూ.1,800	రూ.1,900	రూ.100
28-28-0	రూ.1,800	రూ.1,800	లేదు

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ఏ.సిరి



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం వల్ల జిల్లాలో అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని కలెక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, నదీతీర ప్రాంతాలను పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వాగులు, వంకల వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న చోట వాహన రాకపోకలు నిలిపివేసి, ప్రజలను సురక్షితమైన ప్రత్యామ్నాయ రహదారులపైకి మళ్లించాలని తెలిపారు. విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రాణ ఆస్తినష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పరిహారం చెల్లించండి

- హిట్ అండ్ రన్ కేసులపై

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు నష్టపరిహారాన్ని అందజేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి ఆదేశాలు జారీ చేశారు. విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులపై జిల్లా స్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశం బుధవారం స్థానిక జిల్లా కోర్టులో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు నారాయణపేట జిల్లా అధికారులతో కూడా ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ ట్రయల్ బాధితులు, హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు నష్టపరిహారంతోపాటు అనాథ బాలలకు ఆధార్ కార్డులు మంజూరు చేసే విషయంపై ఆయన ఈ సమావేశంలో సమీక్షించారు. బాధితులకు రెండు కేసులలో రూ.12.50 లక్షలను నష్టపరిహారంగా ఆయన అధికారులతో సంప్రదించి మంజూరు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆధార్ కార్డు లేని 120 మంది అనాథ బాలలను గుర్తించారని, వారిలో 56 మందికి ఆధార్ కార్డులను మంజూరు చేసి మిగతా వారికి సత్వరమే ఆధార్ కార్డులను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి దివాకర్, ఏజీపీ సయ్యద్ షాబుద్దీన్, మెంబర్ పి. శివసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

‘పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్’ అమలు: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తు భద్రతకు, ఆర్థిక స్థిరత్వం కోసం పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ ఏ.సిరి తెలిపారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఈ పథకం కింద 18 సంవత్సరాలు వయస్సు పూర్తి చేసుకున్న ఏడుగురు పిల్లలకు పోస్టాఫీసు సేవింగ్స్ అకౌంట్‌ను పాస్ పుస్తకాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఏడుగురు పిల్లలకు పోస్టాఫీసు బ్యాంకు ఖాతాలో కేంద్రం నుంచి రూ.10లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియాను ఖాతాలో చేశారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద పాల్గొన్నారు.

తరచూ తనిఖీ చేయాలి

జిల్లాలో ఉన్న చిన్నపిల్లల సంరక్షణ సంస్థలను తరచూ తనిఖీ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి అమలుపై కమిటీ మెంబర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా సంస్థల పర్యవేక్షణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ పీడీ విజయని ఆదేశించారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.



వలస వెళ్తున్న కోసిగిలోని 3, 4 వార్డులకు చెందిన కూలీలు

వలసబాట

- 400 కుటుంబాలు వలస
- బోసిపోతున్న గ్రామాలు
- బడుల్లో తగ్గిన హాజరు శాతం

కోసిగి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కోసిగితో పాటు గొడుగల్లు, వందగల్లు, పల్లెపాడు, మూగలదొడ్డి, చిర్తనకల్, సజ్జలగుడ్డం, జంపాపురం, ఆర్లబండ తదితర గ్రామాల నుంచి సుమారు 400 కుటుంబాలు కర్ణాటకకు వలసవెళ్లాయి. బొలెరో, ఇతర ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. ఇప్పటికే కోసిగి మండలం నుంచి వేలాది కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్లారు. వలస కూలీలకు పనులు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా కూడా వారు మాత్రం స్థానికంగా ఉండటం లేదు. ఆడవారికి రూ.400, పురుషులకు రూ.600లు రోజువారి చొప్పున కూలి ఉన్నప్పటికీ ఉపాధి హామీ కింద అధికారులు పనులు కల్పిస్తామన్నా అటుగా ఆసక్తి కనబర్చడం లేదు. ఒకరిని చూసి మరొకరు కూలీలు ఇంటికి తాళాలు వేసి వలసబాట పడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఏ కాలనీ చూసినా బోసిపోతున్నాయి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం సగానికి పైగా పడిపోయింది.



సంగారెడ్డి జిల్లాకు పత్తి పనులకు వలస పోతున్న కూలీలు



వాహనాల్లో కర్ణాటకకు వలస వెళ్తున్న కూలీలు

శ్రీగిరికి కార్తీక శోభ

- తొలిరోజు పోటెత్తిన భక్తులు
- స్వామివారి సేవలు, దర్శనాల్లో పలు మార్పులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన ఏకైక క్షేత్రం శ్రీశైలంలో బుధవారం కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నవంబరు 21వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచే వేలాదిమంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. ఏపీతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మల్లన్నకు మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసంలో రూ.5వేల గర్భాలయ అభిషేకం టికెట్లు, రూ.1500 సామూహిక అభిషేకం టికెట్లను రద్దు చేసినట్లు ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రోజూ విడతల వారీగా మల్లికార్జున స్వామి స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 14న కోటి దీపోత్సవం, నవంబరు 18న తెప్పోత్సవం ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని ఈవో తెలిపారు.

పట్టణాలకు కదులుతున్న పల్లె ప్రజలు

- హైదరాబాద్, గుంటూరు, రాజంపేటకు పయనం
- ఖాళీ అవుతున్న గ్రామాలు



గోనెగండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనులు లేక కూలీలు పొట్ట చేతపట్టుకొని పట్టణాలకు వలసబాట పట్టారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నుంచి వలస బండ్లు కదులుతున్నాయి. బుధవారం ఉదయం గోనెగండ్ల చింతాలమునిస్వామి వీధి నుంచి 40 కుటుంబాలు సంగారెడ్డి జిల్లాలో పత్తి తీసే పనులకు వాహనాల్లో బయలుదేరారు. మూడు, నాలుగు రోజుల నుంచి గోనెగండ్ల మండల గ్రామాల నుంచి 400 కుటుంబాలు వలస వెళ్లాయి. గోనెగండ్ల ఎస్సీ, బీసీ కాలనీ నుంచి 120 కుటుంబాలు తెలంగాణ, రాజంపేట, గుంటూరు, కర్ణాటకలోని మటమర్రి, రాయచూరు గ్రామాలకు రెండు బొలెరో వాహనాల్లో వలసలు వెళ్లారు. అక్కడ పత్తి పొలాల్లో పనుల కోసం వెళ్తున్నారు. కూలీలు చెబుతున్నారు. కేజీ పత్తి తీస్తే రూ. 15 ఇస్తున్నారని అందుకు ఒప్పందం కుదుర్చుకొని వెళ్తున్నామన్నారు. మళ్లీ క్రిస్మస్ పండుగకు ఊరికి వస్తామని చెబుతున్నారు. భార్యాపిల్లలను, తల్లిదండ్రులను వస్తులు ఉంచలేక.. వలసబాట పట్టినట్లు చెమగిలిన కళ్లతో కూలీలు తెలిపారు. వలస వెళ్తున్న కూలీలను ‘ఆంధ్రజ్యోతి’ పలకరించగా ఈ ఏడాది పంటలు సరిగా పండక పోవడం అధిక వర్షాల కారణంగా పంటలు చేతికి అందలేదని, దీంతో పనులు లేవన్నారు. దీనికి తోడు అరకొర పనులు కల్పించినప్పటికీ కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు.

మహిళ దారుణ హత్య
వివాహేతర సంబంధమే కారణం? 7

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం 6

వీగిన అవిశ్వాసం 7

పోస్టాఫీసులో సర్వర్ సమస్య

● లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వలేమని బోర్డులు పెట్టిన వైనం



తల్లికి వందనం డబ్బులు అడగరాదని పోస్టాఫీసులో పెట్టిన బోర్డు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో సర్వర్ సమస్య తలెత్తింది. దీని వల్ల లావాదేవీలు జరగవని, డబ్బులు ఇవ్వలేమని బోర్డు పెట్టారు. తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బులు పోస్టాఫీసులోని ఇండియన్ పోస్టు పే మెంట్ బ్యాంక్(ఐపీపీబీ) ఖాతాలో లబ్ధిదారులకు జమ అయ్యాయి. వాటిని తీసుకునేందుకు వచ్చిన తల్లులకు పోస్టాఫీసులో చుక్కలు చూపిస్తున్నారు. సర్వర్ డౌన్ కావడంతోపాటు కౌంటర్‌లో డబ్బులు ఇవ్వాల్సిన సిబ్బంది ఇతర కార్యక్రమాలకు, శిక్షణకు వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేమని బోర్డులు పెట్టేసారు. దీంతో లబ్ధిదారులు నిరాశగా వెనుతిరుగుతున్నారు.

ప్రశాంతంగా లా సెమిస్టర్

కర్నూలు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): లా 3, 5 సంవత్సరాల రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గురువారం నగరంలోని ఉస్మానియా కళాశాలలో జరిగిన పరీక్షకు 3వ సంవత్సరంలో 359 మంది దరఖాస్తు చేసుకోగా 319 మంది, 5వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 65 మంది దరఖాస్తు చేసుకోగా 58 మంది హాజరయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

● చైర్మన్ ఎం. వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల సేవల ద్వారా నష్టపోయిన బాధితులకు శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందజేస్తున్నట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం. వెంకట హరినాథ్ తెలిపారు. బుధవారం పరిష్కారమైన ఓ కేసులో ఆయన ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా పంచలింగాల చెందిన ఫిర్యాది ఏ. మదన్ మోహన్ కనకదుర్గ ఫైనాన్స్ కంపెనీ నుంచి ఓ వాహనాన్ని తీసుకున్నారు. బాధితుడు వరుసగా అన్నీ ఈఎంఐలు చెల్లించినప్పటికీ ఆర్థిక సమస్యలతో రెండు ఈఎంఐలను చెల్లించలేదు. ఆ తర్వాత ఫైనాన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుని రూ.25వేలను చెల్లించడానికి అంగీకరించి రూ.20వేలను చెల్లించాడు. మిగతా రూ.5వేలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు బాధితుడి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో బాధితుడు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించడంతో బాధితుడికి కలిగిన నష్టాన్ని రూ.69వేలతో పాటు మానసిక వేదన కలిగించినందుకు మరో రూ.20వేలను చెల్లించాలని లోక్ అదాలత్ ఫైనాన్స్ కంపెనీని ఆదేశించింది. ఈ కార్యక్రమంలో సభ్యులు శివశంకర్ రెడ్డి, రాజుబాబు, శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

50 ఎకరాల్లో వరి పంట వర్షార్పణం



నేలకొరిగిన వరి పంట

కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మిగనూరు గ్రామంలో అకాల వర్షానికి వరి రైతులకు అపార నష్టం కలిగించింది. బుధవారం కురిసిన అకాల వర్షానికి తుమ్మిగనూరు గ్రామంలో రైతులు వారం ఈరన్న ఐదెకరాల్లో చేతికొచ్చిన వరి పైరు పూర్తిగా నేలకొరిగింది. దీంతో రూ.2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన కోసిగి అయ్యప్పరెడ్డి, హరిజన దేవమణి, స్వామిదాసు, హరిజన బోడి తిమ్మప్ప, వారం ఈరారెడ్డి రైతులకు చెందిన రైతులకు సుమారు 50 ఎకరాల మేర చేతికొచ్చిన వరి పైరు అకాల వర్షానికి వరి పొలాల్లో నేలకొరగడంతో తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూగజీవాలకు మేతగా ఉల్లి



చింతలచెరువులో గొర్రెలకు వదిలేసిన ఉల్లి పంట

రైతులకు ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. అష్టకష్టాలు పడి ఉల్లి పంటను సాగుచేశారు. దిగుబడి ఏతికొచ్చే సమయంలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో కొందరు ఉల్లిని పొలాల్లోనే వదిలేశారు. మరికొందరు మూగజీవాలకు మేతగా మార్చేశారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు, కొలుములపేట గ్రామంలో రైతులు శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రం సురేష్‌రెడ్డి, మద్దిలేటి, మరి కొందరు రైతులు తమ పొలాల్లోనే ఉల్లిగడ్డలను గొర్రెల కోసం వదిలేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారమిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

కంది రైతు విలవిల!







- అధిక వర్షాలతో పంటకు ఆశించిన పురుగులు
- రాలిపోతున్న పూత
- దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన
- జిల్లాలో 95,262 ఎకరాల్లో కంది పంట సాగు

గోనెగండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా కనిపించినా అధిక వర్షాలతో పంటకు కాయ ఈగ, శనగపచ్చ పురుగు, మారుకా మచ్చపురుగు సోకింది. కంది రైతు విలవిలలాడుతున్నాడు. కంది పంటకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశలో జిల్లా వ్యాప్తంగా 95, 262 ఎకరాల్లో సాగుచేశారు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో బావులు, బోర్ల కింద దాదాపు 8000 ఎకరాల్లో కందిని వేశారు. చాలా మంది రైతులు వేరుశనగతో పాటు ఇతర పంటలో కూడా అంతర్‌పంటగా కూడా వేశారు. గోనెగండ్ల, కులుమాల, అలువాల, పెద్దమరివీడు, చిన్న మరివీడు, వేముగోడు, పుట్టపాశం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, తిప్పనూరు, హెచ్ కైరవాడితో పాటు పలు గ్రామాల్లో కంది పంటను సాగుచేశారు. ప్రస్తుతం సోకిన పురుగుకు ఎన్ని మందులు పిచికారి చేసినప్పటికీ అదుపులోకి రావడంలేదు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. శనగపచ్చ పురు గు, కాయ ఈగ, జీడపురుగు, మారుకామచ్చ తెగు లు ఎక్కువగా ఉండటంతో పూత మొత్తం రాలిపోతుంది. దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకునేలా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు.

మారుకామచ్చ పురుగు

ఈ పురుగు ఎక్కువగా సోకినట్లు తెలుస్తుంది. ఈ పురుగు రెక్కలు పురుగు గుడ్లనుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూత, కాయలను లోపల నుంచి తిని నష్టం చేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమెక్టిన్‌బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ మిల్లీ లీటర్ లేదా అంప్టిగో 1 మిల్లీ లీటర్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

కాయ ఈగ: ఈ పురుగు కనబడకుండా చాలా నష్టం నలుగజేస్తుంది. తన గుడ్లను కాయ చర్మం తొలిచి అక్కడ పెడుతుంది. వాటి నుంచి పొదిగిన పిల్ల పురుగులు లోపల నుంచి కాయలను తిని నష్టం కలిగిస్తాయి. ఈపురుగు నివారణకు ముందస్తుగా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

శనగపచ్చ పురుగు: ఈ పురుగు లార్వాలు కాయలపై రంధ్రం చేసుకొని లోపలికి వెళ్లి తిని నష్టం కలిగిస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేస్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో మరియు 2శాతం బెల్లం ద్రావణం కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

అధికారులు సలహాలివ్వాలి

పురుగులతో పూత మొత్తం రాలిపోతుంది. ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు పంటలను పరిశీలించి సలహాలివ్వాలి. ఏ మందు పిచికారి చేయాలి ఎంత చేయాలనే విషయాన్ని వివరించాలి.

● మాబు, రైతు, గోనెగండ్ల

సకాలంలో పిచికారి చేయాలి



రైతులు సకాలంలో పురుగును గుర్తించి మందులు పిచికారి చేయాలి. గోనెగండ్ల మండలంలో కంది పంటకు దోమ, శనగపచ్చ పురుగు సోకింది. కంది పంట ఏపుగా పెరిగింది. మామూలు పద్ధతిలో కాకుండా డ్రోన్ ద్వారా పిచికారి చేస్తే మందు, ద్రావణం మొక్క పైభాగంలో చేరుతాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడి బాగా వస్తుంది.

● మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

'ఉపాధి' బడ్జెట్ రూపకల్పన

- గ్రామాల వారీగా ప్రణాళిక తయారీకి శ్రీకారం
- రూ.265 కోట్లతో కార్యాచరణ



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) సంబంధించి ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఏటా ఈపనుల కోసం డిసెంబరులోనే బడ్జెట్‌ను తయారు చేస్తారు. అక్టోబరు 3న మొదటి గ్రామసభలో ప్రణాళిక తయారీపై చర్చించాలని, నవంబరు 18న ఆయా గ్రామ పంచాయతీలు బడ్జెట్‌ను రూపొందించారు. అదే నెల 30న మండల పరిషత్, డిసెంబరులో 15వ తేదీకి జడ్పీ తమ ప్రణాళికలను ఆమోదించాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఈప్రక్రియ మొత్తం డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రణాళికను యుక్తధార పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని, ఒక వ్యక్తికి రోజుకు రూ.307ల వేతనం మెటీరియల్ కింద 204.66 ఖర్చు మొత్తం కలిపి రూ.511.66 బడ్జెట్‌ను రూపొందిస్తారు.

నాలుగు కేటగిరిల కింద 192 రకాల పనులకు..

నాలుగు కేటగిరీల కింద 192 రకాల పనులకు ఈ పథకం కింద అవకాశం కల్పించాలని కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత, సామాజికపరమైన పనులున్నాయి. మొక్కలు నాటడం, ఫీడర్ కెనాల్స్ నిర్మాణం, ఫీల్డ్ బండ్స్, భూమి అభివృద్ధి, కమ్యూనిటీ వాటర్ హార్వస్టింగ్ పాండ్స్ రీచార్జి కిట్లు, పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం, వర్షం నీటి సంరక్షణ, ట్రెంచ్‌లు, చెక్‌డ్యామ్‌లు, సాగునీటి బావుల నిర్మాణం, పంట కాలువలు చెరువుల్లో పూడిక తీత, కందకాల తవ్వకాలు, పండ్లతోటల పెంపకంతో పాటు తుఫాన్ షెల్టర్లు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తుండటంతో రబీ మొదలు కావడంతో ఉపాధి పనులు కొంత మందగించాయి. ప్రణాళిక పూర్తికాగానే పనులు త్వరితగతిన ప్రణాళిక ప్రకారం చేయడం జరుగుతుందని డ్వామా సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

కమిటీలు ఏర్పాటు

గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ బడ్జెట్ రూపకల్పనకు కమిటీలు ఏర్పాటు చేశారు. దీనిలో సాంకేతిక సహాయకులు, జీఎస్డీ, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, క్షేత్ర సహాయకులు పంచాయతీలో సీనియర్ మేట్లు, లైన్ డిపార్టుమెంట్ల నుంచి సభ్యులు ఉంటారు. ఈ బృందాన్ని ఏపీవో పర్యవేక్షిస్తారు. గ్రామసభల షెడ్యూల్ పీవో, ఎంపీడీవోలు నిర్ణయిస్తారు. కూలీలు, హేబిటేషన్ల ప్రాతిపదికన మూడు, నాలుగు రోజుల్లో ప్రణాళిక తయారు చేయాలి. ఈసారి కొత్త సంవత్సరం చేపట్టబోయే పనుల్లో గ్రామాల్లో పాడిపశువుల కోసం గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యమిచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చారు. ఈ రెండు జిల్లాల్లో 5 లక్షల మంది దాకా సీజన్‌లో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం క్రియాశీలక జాబ్‌కార్డులు రెండున్నర లక్షల దాకా ఉన్నాయి. రెండు జిల్లాలో కలిపి వేసవి సీజన్‌లో 2లక్షల మంది దాకా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు, కూలీలకు పనులు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలను గ్రామాల వారీగా రూపొందించాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. దశల వారీగా ఉపాధి ప్రణాళికను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తయారు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

● వెంకటరమణయ్య, పీడీ, కర్నూలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా, నవంబరు 1 నుంచి 7 వరకు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 'కర్నూలు ఉత్సవ్-2025' కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటుచేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ నాటక అకాడమీ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవ్‌లో ఉన్నత పాఠశాలల వారిని జూనియర్స్‌గా, కళాశాల వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు. 'ఉమ్మడి కర్నూలు జిల్లా వైభవం' అనే అంశంపై ఈ పోటీలు ఉంటాయని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటూ కన్సొలేషన్ బహుమతులు అందిస్తామని వివరించారు. ఈ పోటీలు ఈనెల 31న ఉదయం 10.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఉంటాయని, ఒక్కో విద్యాసంస్థ నుంచి 5గురి పేర్లను 99892 65632కు ఈనెల 27 తేదీలోగా పంపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కళాక్షేత్రం ప్రతినిధులు పీపీ గురుమూర్తి, చంద్రకంటి మద్దయ్య, డి.ఈశ్వరయ్య కన్వీనర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ఆఫీసు సబార్డినేట్ పోస్టు దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో పని చేయడానికి ఆఫీసు సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి తెలియజేశారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి 7వ తరగతి పాస్ అయిన వారు, లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారు అర్హులని అన్నారు. ఈ దరఖాస్తులను జిల్లాలోని ఏదైనా కోర్టు ఆన్‌లైన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వాటిని నవంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలను ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల వెబ్‌సైట్‌లలో చూడవచ్చని అన్నారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- మహానందిలో కార్తీక మాస ఉత్సవ ఏర్పాట్లు
- ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితో ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మహానంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి నెల రోజుల పాటు జరిగే కార్తీక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మహానంది ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్తీకమాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లపై బుధవారం ఈఓ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఈఓ: నవంబరు 20 వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని క్షేత్రానికి వచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశాం.

ప్రశ్న: దర్శనం సమయం ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారు?

ఈఓ: రద్దీ అధికంగా ఉంటుందని భావించి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు నిరంతరం దర్శనం ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సాధారణ భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఈఓ: సాదారణ భక్తులకే ప్రాధాన్యం ఇస్తాం. ఉచిత క్యూలైన్ ఏర్పాటుతో వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటుతో పాటు విశ్రాంతి కోసం పరిసరాల్లోని పోచా విశ్రాంతి భవనాన్ని ఉచితంగా కేటాయించాం. క్యూలైన్లలో పాలు, బిస్కెట్లు అందజేస్తాం. భక్తుల భద్రత కోసం అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. వాహనాల కోసం రెండు ప్రదేశాల్లో లైటింగ్‌తో కూడిన పార్కింగ్ ఏర్పాటు చేశాం.

ప్రశ్న: అన్న ప్రసాదం కల్పిస్తున్నారా?

ఈఓ: కార్తీక మాసం సందర్భంగా ఆది, సోమవారాల్లో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు దేవస్థానం తరపున నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిర్వహిస్తాం.

ప్రశ్న: కార్తీక పౌర్ణమి రోజు కోటి దీపోత్సవం, జ్వాలా తోరణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారా?

ఈఓ: నవంబరు 5న క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కోటి ఒత్తులతో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వహిస్తాం. వేలాదిమంది భక్తులు పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: లడ్డు ప్రసాదాలు సిద్ధం చేశారా?

ఈఓ: రద్దీకి అనుగుణంగా భక్తులకు కోరినన్ని లడ్డు ప్రసాదాలు అందచేస్తాం. రద్దీ రోజుల్లో మరిన్ని ప్రసాదాలు తయారు చేసి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తాం.

ప్రశ్న: పరోక్ష సేవలో భాగంగా రూ.2 వేలు అందించే భక్తులకు ఏవిధంగా సేవలు అందిస్తారు?

ఈఓ: కార్తీకమాసం క్షేత్రానికి రాలేని భక్తుల కోసం పరోక్ష సేవలు ప్రవేశ పెట్టాం. ప్రతిరోజు గోత్రం, పేరుతో అభిషేకం, మాసం ముగిశాక ప్రసాదాలను పోస్టుద్వారా పంపుతాం.

ప్రశ్న: కార్తీకమాసంలో ప్రత్యేక ఏర్పాట్లు?

ఈఓ: ఆలయ గోపురాలతో పాటు పరిసరాలకు విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశాం. రద్దీ రోజుల్లో గర్భాలయంలో కాకుండా సామూహిక అభిషేకాలు ఏర్పాటు చేస్తాం. నాలుగు సోమవారాల్లో రాత్రి వేళల్లో జలహారతి ఏర్పాటు చేస్తున్నాం. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చేస్తాం. మైకుల ద్వారా భక్తులకు సూచనలు ఇస్తాం. అన్ని శాఖల సహకారంతో పాటు ఆలయ సిబ్బంది సమష్టి కృషితో కార్తీక ఉత్సవాలను నిర్విఘ్నంగా పూర్తి చేస్తాం.

రాఘవేంద్రుడి సేవలో

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే

● మంత్రాలయంలో తెలంగాణ, కర్ణాటక మంత్రులు



కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని బుధవారం కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు తెలంగాణ క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిట శ్రీహరి, కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసేరాజు, రాయచూరు ఎంపీ కుమార్ నాయక్, మంత్రాలయం, మాన్వీ, మస్కీ, రాయచూరు రూరల్, సింధనూరు ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, హంపయ్యనాయక్, బసవన్నగౌడ, దద్దాల బసవన్నగౌడ, హంపన్నగౌడ, ఎమ్మెల్సీలు బసన్నగౌడ బడాలీ, వసంతకుమార్, బసవరాజుపాటిల్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోణాపూరు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు వివరించారు. వీరికి రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు , పరిమళ ప్రసాదం, వెండిగిన్నెలు ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట రాజా ఎస్ అప్రమేయ ఆచార్, కృష్ణ కౌసిక్, కిరణ్ కుమార్, సంజీవ్ కులకర్ణి, రాయచూరు ఎస్పీ పుట్టమాదయ్య, కలెక్టర్ నితీష్, కర్నూలు ఏఎస్పీ హుస్సేన్ పీర, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, రాయచూరు సీఈఓ ఈశ్వర్‌కుమార్ పాండు, ఏసీ గజానంద్ బోలె, రాయచూరు ఏఎస్పీలు హరీష్, కుమార్‌స్వామి, శాంతివీర, తహసీల్దారు రమాదేవి, సీఐలు రామాంజులు, మంజునాథ్, పద్మనాభతీర్థ ఏసీ గెస్ట్‌హౌస్, పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రదక్షిణలు చేస్తున్న డీకే శివకుమార్, మంత్రులు

మూలరాములకు మహాభిషేకం

- శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం శ్రీమఠంలో బుధవారం బలి పాడ్యమిని పురస్కరించుకుని మూలరాములకు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మహాభిషేకం నిర్వహించారు. ఏడాదికి రెండుసార్లు జరిగే (శ్రీరామనవమి, బలిపాడ్యమి)ని పూర్ణబోధ పూజామందిరంలో ఘనంగా నిర్వహించడం శ్రీమఠంలో సంప్రదాయంగా వస్తోంది. పూర్ణబోధ పూజా మందిరంలోని వెండి మండపంలో బంగారు మంటపం అధిష్టించి అందులో నవరత్నాలతో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకం చేశారు. క్షీరాభిషేకం, తులసి అర్చన, పుష్పాభిషేకం, స్వర్ణ నాణేలతో అభిషేకం, గంధలేపనం, వివిధ పదార్థాలతో మహాఅభిషేకం నిర్వహించారు. ఈ వేడుకను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ, కర్ణాటక మంత్రులు వాకిట శ్రీహరి,బోసేరాజులతో పాటు వేలాది మంది భక్తులు తిలకించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు రజిత గజవాహనం, బంగారు రథ సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజా ఎస్.గిరిరాజాచార్, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, విజయేంద్ర ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.



మూల రాములకు అభిషేకం చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

వీగిన అవిశ్వాసం

- పట్టు నిలుపుకున్న మీనాక్షినాయుడు
- కూటమి నాయకుల సంబరాలు
- ఆదోని ఎంపీపీగా దానమ్మ కొనసాగింపు




విజయకేతనం చూపుతున్న నాయకులు, ఇన్‌సెట్‌లో ఎంపీపీ దానమ్మ

ఆదోని రూరల్/ ఆదోని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ బడాయి దానమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తన మార్క్ రాజకీయంతో పట్టు నిలుపుకున్నారు. దీంతో కూటమి నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. ఎంపీపీ దానమ్మపై వైసీపీ అవిశ్వాస తీర్మాన సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ భవన్‌లో ప్రారంభమైంది. అవిశ్వాస తీర్మానంలో ప్రస్తుత ఎంపీటీసీలను పరిగణలోకి తీసుకుంటే తాము ఎలాగైనా నెగ్గుతామని వైసీపీ ఎంపీటీసీలు భావించారు. 20 మంది మెజార్టీ సభ్యులున్న వైసీపీ ఎంపీటీసీల్లో 16మంది మాత్రమే సమావేశ మందిరానికి వచ్చారు. మిగిలిన నలుగురు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. పంచాయతీరాజ్ యాక్టు ప్రకారం 29 ఎంపీటీసీలకు గాను 2/3 చొప్పున 19మంది హాజరు కావాలని అధికారులు సూచించారు. 16మంది వైసీపీ ఎంపీటీసీలు ఉన్నారని, అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ సభ్యులకు చెప్పారు. ఎంపీపీగా దానమ్మ కొనసాగుతారని చెప్పారు. అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి చేదు అనుభవం తప్పలేదు. మీనాక్షి నాయుడు చక్రం తిప్పితే పరాభవం తప్పదని, ఇప్పుడు అదే నిజమైందని ఆయన తన అనుచరులతో చర్చించినట్లు తెలుస్తోంది.

29 మంది ఎంపీటీసీలను..

ప్రభుత్వ ఒత్తిడి వల్ల ఓడించారు. 29మంది ఎంపీటీసీలను పరిగణలోకి తీసుకోవడం తప్పు. మూడు ఎంపీటీసీలకు ఎన్నికలు జరగలేదు. 26మందికే ఎన్నికలు జరిగాయి. అందులో ఇద్దరు మృతిచెందగా, ఒకరు రాజీనామా చేశారు. 23మందిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి.

– సాయిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆదోని

కూటమి నాయకుల సంబరాలు

అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో కూటమి నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. మీనాక్షినాయుడు సోదరుడు, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడును ఎంపీపీ భర్త బడాయి పంపాపతి ఆలింగనం చేసుకొని కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు విట్టా రమేష్, కృష్ణమ్మ, రామస్వామి, ఆచారి, రంగస్వామి నాయుడు, శివప్ప, వీరేష్‌తోపాటు పెద్దఎత్తున మండల కార్యాలయానికి చేరుకొని ఎన్డీఏ జిందాబాద్, చంద్రబాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

భారీ బందోబస్తు

మండల కార్యాలయ సమీపంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, నలుగురు ఎస్‌ఐలతో పాటు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ఏ పార్టీకి చెందిన నాయకులను రానివ్వ కుండా కేవలం ఎంపీటీసీలు మాత్రమే వచ్చేలా చర్యలు చేపట్టారు.

మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా..

- ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీ కార్యకర్త బెదిరింపు



దాచి ఉంచిన స్టాక్‌తో అధికారులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కోడి గుడ్లు, ఇతర పౌష్టికాహారం ఉన్న ఇంటికి తాళాలు తీస్తే మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని 25 సెంటర్ అంగన్‌వాడీ కార్యకర్త అధికారులను బెదిరించింది. ఈ సంఘటన బుధవారం జరిగింది. పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర ఉండే శివాలయం పక్కన ఓ ఇంట్లో అంగన్‌వాడీ పిల్లలకు ఇచ్చే కోడి గుడ్లు, ఇతర పౌష్టికాహారం ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందింది. ఆ శాఖ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ పాతబస్టాండ్‌లోని ఆ ఇంటికి చేరుకొన్నారు. అప్పటికే అంగన్‌వాడీ టీచరు కోడి గుడ్లు దాచిన ఇంటికి తాళం వేసుకొని వెళ్లి పోయింది. దీంతో సూపర్‌వైజర్ దస్తగిరిమ్మ కూడా మరో తాళాన్ని ఆ ఇంటికి వేసి సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఐసీడీఎస్ అధికారులు సదరు అంగన్‌వాడీ టీచర్‌ను ఇంటి వద్దకు రావాలని ఎన్నిసార్లు చెప్పినా రాలేదు. పైగా ఇంటి దగ్గరి నుంచి అధికారులంతా వెళ్లిపోవాలని, లేదంటే మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. దీంతో సీడీపీఓ తేజేశ్వరి, పాలసాగరం సచివాలయ అధికారులు, పోలీసు అధికారుల సమక్షంలో తాళాలు తీసి అందులో ఉన్న స్టాక్‌ను ఐసీడీఎస్ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని సీడీపీఓ తేజేశ్వరి తెలియజేశారు.

ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా



వాహనం నుంచి వస్తున్న పొగలు

గూడూరు (కోడుమూరు రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే నాగలాపురం సమీపంలో ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న క్రూసర్ వాహనం బోల్తా పడింది. కర్నూలు నుంచి కొంతమంది ఉపాధ్యాయులు క్రూసర్ వాహనంలో ప్రతిరోజూ విధులకు వెళుతుంటారు. బుధవారం ఉదయం వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనతో వాహనం నుంచి పొగలు వెలువడ్డాయి. అటుగా వెళుతున్న వాహనదారులు, స్థానికులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టి అందరినీ బయటకు లాగారు. ప్రమాదంలో కొందరికి మూగదెబ్బలు తగిలాయి.

అమేజాన్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్

- వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను ఖాతరు చేయని అమేజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు మరో ఇద్దరికి అరెస్టు వారెంట్లు జారీ చేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన ఫిర్యాదీదారు కురువ వీరేష్ 2024 సెప్టెంబరు 29న యాపిల్ ఐఫోన్ 15+ ఫోన్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేశారు. ఈ మేరకు ఆయన రూ.79,900 ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేశాడు. అయితే.. అమేజాన్ కంపెనీ ఆర్డర్ చేసిన మోడల్‌కు బదులుగా ఐక్యూ00 నియో9 ప్రో అనే సెల్ ఫోన్‌ను అందజేసింది. అయితే.. తాను పెట్టిన ఆర్డర్‌కు బదులుగా వేరే మోడల్‌ను డెలివరీ చేయడంతో వీరేష్ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కమిషన్ అమేజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు మరో ఇద్దరికి నోటీసులు జారీ చేసినా కూడా వారు హాజరు కాలేదు. దీంతో ఫిర్యాదికి ఐఫోన్ ఖరీదు రూ.79,900, 12 శాతం వడ్డీతో పాటు మానసిక ఆవేదన, కోర్టు ఖర్చుల కింద మరో రూ.35వేలను 45 రోజుల్లోపు అందజేయాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా అమేజాన్ కంపెనీ, ప్రతివాదులు జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయలేదు. దీనిపై ఆగ్రహించిన కమిషన్ అమేజాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కు అరెస్టు వారెంట్లు జారీ చేసి కేసును ఈ ఏడాది నవంబరు 21వ తేదీకి వాయిదా వేస్తూ చైర్మన్ కిషోర్ కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

నంద్యాల టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అశోక్ నగర్‌లో యువకుడు రఫీ (27) కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రఫీ స్థానికంగా దాల్‌మిల్ నిర్వహిస్తున్నాడు. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు వేసుకున్నాడు. బంధువులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం?

వెల్దుర్తి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో నివాసముంటున్న మహిళ షేక్ ఉజ్మా(34) దారుణ హత్యకు గురైంది. బుధవారం సాయంత్రం ఉజ్మా పెద్ద కూతురు కాలేజీ నుంచి ఇంటికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో తల్లి బయటకు వెళ్లిందేమోనని ఎదురు చూసింది. చిన్న కూతురు కూడా పాఠశాల నుంచి తిరిగి వచ్చాక, తల్లి చెప్పులు బయటే ఉండటం గమనించి అనుమానం కలిగి ఇంటి తాళాన్ని పగులకొట్టి లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లో తల్లి రక్తపు మడుగులో ఉండటం గమనించి భయాందోళనతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. సీఐ మధుసూదన్‌రావు, ఎస్‌ఐ అశోక్ కుమార్, ట్రైనీ ఎస్‌ఐ విద్యశ్రీ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. మృతురాలిపై కొడవలితో దాడి చేసినట్లు గుర్తించారు. ఈ హత్యకు వివాహేతర సంబంధం కారణం కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఉజ్మాతో వివాహేతర సంబంధం ఉన్న మున్నా అనే వ్యక్తి ఆ సమయంలో అటుగా తచ్చాడాడని స్థానికులు చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. హత్య చేసిన వ్యక్తి మృతురాలి సెల్ ఫోన్‌తోపాటు సీసీ కెమెరాల డిస్క్ సైతం తీసుకెళ్లినట్లు తెలిపారు. మృతురాలి తల్లి నూర్జహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌రావు, ఎస్‌ఐ అశోక్ తెలిపారు.



షేక్ ఉజ్మా (ఫైల్)

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బెలుం గుహల వద్ద ప్రధాన రహదారిలో బుధవారం రెండు లారీలు ఢీకొన్నాయి. గుహల వద్ద మలుపు తిరుగుతున్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కుడికాలు ఇరుక్కోవడంతో స్థానికులు అతడిని బయటకు తీశారు. తీవ్రగాయాలు కావడంతో అతడిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెండు లారీలు ఢీకొనడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. సీఐ రమేష్‌బాబు నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకొని లారీలు తొలగించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



ఢీకొన్న లారీలు

మరణానంతర జీవితం

- తల్లి అవయవాలు దానం చేసిన కొడుకులు
- ఫిట్స్‌తో మెదడులో రక్తస్రావమై బ్రెయిన్ డెడ్
- నలుగురికి అవయవాల దానం
- పోలీసులు గ్రీన్ చానల్ ద్వారా అవయవాల తరలింపు




నివాళులర్పిస్తున్న కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, అవయవదాత భాగ్యమ్మ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం చేస్తే మరణించిన తర్వాత కూడా జీవించినట్లేనని అంటారు. వ్యాధులతో, ప్రమాదాలతో మృత్యుముఖంలో ఉన్న వాళ్ల జీవితం నిలబెట్టినట్లవుతుంది. బ్రెయిన్ డెడ్ అయిన ఓ తల్లి అవయవాలు దానం చేయడానికి కొడుకులు సిద్ధపడ్డారు. తద్వారా ఆమెకు పునర్జన్మ కలిగేలా చేశారు. ఆమె భర్త ఎప్పుడో 15 ఏళ్ల క్రితమే మరణించారు. తన రెక్కల కష్టంతో ఆమె ఆరుగురు పిల్లను పెంచి పెద్ద చేసింది. అలాంటి తల్లికి ఫిట్స్ వచ్చి మెదడులో రక్తస్రావం జరిగి బ్రెయిన్ డెడ్ అయింది. అవయవదానంతో తమ తల్లి మరణానంతరం కూడా జీవించాలని పిల్లలు భావించారు. ఈ ఘటన కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో జరిగింది. నంద్యాల జిల్లా శ్రీశైలంలోని కొత్తపేటకు చెందిన భాగ్యమ్మ (50)కు ఈ నెల 18వ తేదీ రాత్రి ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చాయి. మొదట ఆమెను శ్రీశైలం దేవస్థానం హాస్పిటల్‌లో చూపించారు. అక్కడి నుంచి 19వ తేదీ కర్నూలులోని మౌర్య హాస్పిటల్‌కి తీసుకువచ్చారు. మెదడులో రక్తస్రావమైనట్లు వైద్యులు గ్రహించారు. అక్కడ వైద్యం చేయించినా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఈ నెల 21వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. ఆమె అవయవాలను దానం చేసే అవకాశం ఉండటంతో జీవన్‌దాన్ స్టేట్ కోఆర్డినేటర్ డా.కే. రాంబాబు బృందం బ్రెయిన్ డెడ్ అయిన మహిళ పిల్లలకు కౌన్సెలింగ్ చేసి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు తమ తల్లి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఒక కిడ్నీని, కాలేయాన్ని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్న రోగులకు దానం చేయగా.. మరో కిడ్నిని నెల్లూరులోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి, ఊపిరితిత్తులను హైదరాబాదులోని గ్లోబల్ హాస్పిటల్‌కు పంపారు. ఇందుకోసం కర్నూలు పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా అవయవాలను తక్కువ సమయంలోనే నెల్లూరు, హైదరాబాదుకు చేరడానికి కృషి చేశారు. అవయవదాత భాగ్యమ్మ కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్యబృందం, జీవన్‌దాన్ బృందం అశ్రునయనాలతో పుష్పాంజలి ఘటించారు.

నిందితుల అరెస్టు

- ప్రొటెక్షన్ వాచర్ మృతి కేసును ఛేదించిన పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలం అటవీ ప్రాంతంలో లక్మానాయక్ అనే ప్రొటెక్షన్ వాచర్ మృతికి కారకులైన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరులో డీఎస్పీ రామాంజీనాయక్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. మిడ్తూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వర్లు (24), పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన మాదారం సుభాష్ నాయుడు (21) అనే ఇద్దరు ఈ నెల 18వ తేదీన భానుముక్కల-భానుకచెర్ల గ్రామాల మధ్యలో ఉండే అటవీ ప్రాంతంలోని నీటికుంట వద్ద వన్యప్రాణులను వేటాడేందుకు 11కేవీ విద్యుత్ లైన్ నుంచి జీ-వైర్ తీగలను అమర్చారు. అయితే అటవీ రక్షణలో భాగంగా అదే రోజు రాత్రి 10.40 గంటలకు అక్కడికి వెళ్లిన ప్రొటెక్షన్ వాచర్ ప్రమాదవశాత్తు ఆ తీగను తగిలాడు. కరెంట్ షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాడు. ఏబీవో వెంకటేశ్వర్లు పాములపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను బుధవారం వెలుగోడు - వేంపెంట రహదారిపై గుంతకందాల గ్రామ శివార్లలో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురి నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారు. కేసును ఛేధించిన ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్సై సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ ఎంపీ.రమణ, సిబ్బంది రామానాయుడు, షేక్షావలి, శంకర్‌లను ఎస్పీ సునీల్ షెరాన్, డీఎస్పీ రామాంజీనాయక్ అభినందించారు.

'వస్త్రాలయ' బంపర్ డ్రా విజేతకు కారు

- తాళం చెవిని అందజేసిన ఎమ్మెల్యే గౌరు చరిత



కారు తాళం అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, చిత్రంలో మాల్ యజమాని గోపాల్‌రెడ్డి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాధవీనగర్ వస్త్రాలయ షాపింగ్ మాల్‌లో బుధవారం బంపర్ డ్రా లక్కీ డిప్ తీశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చేతుల మీదుగా విజేత రఘుప్రియకు కారు తాళం చెవిని అందజేశారు. షాపింగ్ మాల్ అధినేత గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మాల్ ప్రారంభోత్సవం, దసరా, దీపావళి సందర్భంగా ప్రతి రూ.వెయ్యి కొనుగోలుపై డైలీ లక్కీ డ్రాలో టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, లాప్‌టాప్ అందజేశామన్నారు. అలాగే దీపావళి రోజు బంపర్ డ్రాగా ప్రకటించిన కారును పాణ్యం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. వస్త్రాలపై 10 నుంచి 30 శాతం తగ్గింపు ధరలతో అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు.

26న 'పాప దొరికింది' హాస్య నాటిక

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 26 ఆదివారం సాయంత్రం 7గంటలకు 'పాప దొరికింది' హాస్య నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, యాగంటీశ్వరప్ప ప్రకటనలో తెలిపారు. గుంటూర ఆరాధన ఆర్ట్స్ అకాడమీ కళాకారుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ఆధారంగానే దేశాభివృద్ధి జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఏపీఎస్‌ఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు డివిజన్ పరిధిలోని 7 మండలాల ఎంపీపీలు, సర్పంచులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ గ్రామాలనే దేశానికి పట్టుకొమ్మలని, క్షేత్ర స్థాయి అభివృద్ధిలో సర్పంచులు, ఎంపీపీలు కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల నిర్మాణాలు, పారిశుధ్యం, కాలువల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజులవాణి, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు వి.జేమ్స్, కృపవరం, జి.నాగేష్, ఎస్.అష్రఫ్ బాషా, పి. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై వైసీపీకి మాట్లాడే హక్కు లేదు



మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు వైసీపీ నాయకులకు లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు షణ్ముఖతో కలిసి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బీసీలకు 26 నుంచి 34 శాతానికి రిజర్వేషన్లను పెంచారని, దీనిపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీల మేరకు సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. షణ్ముఖ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావమే బీసీల అభివృద్ధి కోసమన్నారు. రాంబాబు, సుజాత, కృష్ణోజి రావు, బీసన్న, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

హైస్పీడ్ ట్రాక్‌లకు గ్రీన్ సిగ్నల్

- గంటకు 350 కి.మీ వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గాలు



నంద్యాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల మీదుగా అధునాతనమైన టెక్నాలజీతో హైస్పీడ్ రైల్వే లైన్ నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. బుధవారం రైల్ ఇండియా అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్) అనే సంస్థ ప్రాజెక్టు రూపంలో విడుదల చేసింది. రెండు తెలుగురాష్ట్రాలు మీదుగా 350 కిలోమీటర్ల వేగంతో వెళ్లే దిశగా రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాదు- బెంగళూరు (605కి.మీ), హైదరాబాదు- చెన్నై (760కి.మీ) దిశగా రూపకల్పన చేశారు.

తెలంగాణ, ఏపీ, కర్ణాటక మీదుగా..

హైదరాబాదు- బెంగుళూరు రైలు మార్గం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా.. హైదరాబాదు- చెన్నై రైలు మార్గం తెలంగాణ, ఏపీ, తమిళనాడు మీదుగా నిర్మించనున్నారు. ప్రస్తుత రైలు ట్రాక్‌పై 130కి.మీ వేగంతో మాత్రమే వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో పున:పరిశీలన చేసి నూతన విధానంలో రైల్వేశాఖ ప్రత్యేక హైస్పీడ్ రైలు మార్గాలకు శ్రీకారం చుట్టినట్లైంది.

వివిధ పనులకు అంచనా..

ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే హైదరాబాదు- బెంగళూరు లైన్ 605 కి.మీలకు రూ. 2.38 లక్షల కోట్లు, అదేవిధంగా హైదరాబాదు- చెన్నై లైన్ 760 కి.మీలకు రూ. 3.04 లక్షల కోట్లు అంచనా వేశారు. ఈ ప్రకారం.. హైదరాబాదు- బెంగళూరు లైన్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 46.56 కి.మీలు, నంద్యాల జిల్లాలో 37.3 కి.మీలు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 86.6 కి.మీలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ మేర నిర్మాణం కానుంది. 988.82 హెక్టార్ల భూమి అవసరం కానుంది. కర్నూలు జిల్లాలో 139.68 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 111.9 హెక్టార్లు కేటాయించాల్సి ఉంది.

రైలు రూట్ ఇలా..

హైదరాబాదు- బెంగుళూరు హైస్పీడ్ రైలు మార్గం రూపొందించిన ప్రకారం.. హైదరాబాదు ఎయిర్‌పోర్ట్, భరత్ సీటీ, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, నంద్యాల జిల్లాలోని డోన్, అనంతపురం జిల్లాలోని గుత్తి, అనంతపురం, హిందూపురం, కర్ణాటకలోని అలిపుర, దేవనహళ్లి మీదుగా సదరు లైన్ నిర్మించనున్నారు. హైదరాబాదు-చెన్నై లైన్ హైదరాబాదు, శంషాబాద్, భరత్‌సీటీ, ఏపీలోని డచ్చిపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడురు, తిరుపతి, (ఎయిర్‌పోర్ట్) చెన్నై ఐటర్‌రింగ్‌రోడ్, చెన్నై స్టేషన్ల మీదుగా ఏర్పాటు చేయనున్నారు. ఇదే క్రమంలో ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మీదుగా వెళ్లనుంది.

ఒక్కొక్క రైల్వేస్టేషన్‌కు 50 ఎకరాలు..

హైస్పీడ్ రైల్వే నిర్మాణాల్లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించి త్వరలోనే సదరు పనులకు సంబంధించి అడుగులు వేయనున్నారు. రైలు మార్గాల భూమి అనుకూలమైన అలైన్‌మెంటు గుర్తింపు పక్రియ, ఎక్కడ ఏ స్టేషన్ నిర్మించాలి..? అనే విషయాలపై నిర్ణయం తీసుకుంటారు. ఒక్కొక్క రైల్వేస్టేషన్ నిర్మాణానికి 50 ఎకరాల చొప్పున భూమి సేకరణ చేయడంతో పాటు అవసరమయ్యే మౌళిక సదుపాయా లకోసం సమగ్ర సర్వే, నిర్మాణాల కోసం సమన్వయంలో రైల్వే, ప్రభుత్వం అడుగులు వేయనుంది. ఏది ఏమైనా సదరు రైలు మార్గం సాకారమైతే ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలో బుల్లెట్ రైళ్ల యోగం పట్టనుంది.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ఎస్ఆర్ శంకరన్ జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కృషి చేశారని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసరపు వెంకటేశ్ అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపించడంలో ఆయన చేసిన కృషి అపారమన్నారు. ఎస్.నాగేంద్ర, పుల్లంరాజు, చిటికెల శామ్యూల్, నరేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలలోకి మురుగు



నగరంలోని శరీన్‌నగర్‌లో మండల పరిషత్, ఉర్దూ పాఠశాల విద్యార్థులు మురుగుతో అవస్థలు పడుతున్నారు. పక్కనే ఉన్న వెంకటేశ్వరనగర్‌లో డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు పాఠశాలల్లోకి వెళుతోంది. దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పాఠశాల పక్కనే ఎంఈవో కార్యాలయం ఉన్నా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ● కల్లూరు

నేడు డయల్ యువర్ కమిషనర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో సమస్యల పరిష్కారానికి గురువారం 'డయల్ యువర్ కమిషనర్' నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ప్రజలు స్థానిక సమస్యలను 08518-221847 నెంబర్‌కు ఫోన్‌లో తెలియచేయాలన్నారు. తాగునీరు, వీధి దీపాల మరమ్మతులు, రహదారుల మరమ్మతులు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్‌శాఖ కంట్రోల్ రూం ఏర్పాటు

కల్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌శాఖ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా సమస్యలు తలెత్తితే 08518 221919 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

క్రీడాస్ఫూర్తిని చాటి విజేతలు కావాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటి విజేతలు కావాలని డీఎస్‌డీవో భూపతిరావు సూచించారు. బుధవారం అవుట్‌డోర్ స్టేడియంలో కర్నూలు మండల బాలికల క్రీడల ఎంపిక నిర్వహించారు. కర్నూలు అర్బన్ ఎంఈవో-2 ఈశ్వరీబాయితో కలిసి పోటీలను ప్రారంభించారు. కార్యదర్శులు రాఘవేంద్ర, టి.కృష్ణ, నాగేశ్వరి, గేమ్స్ కోఆర్డినేటర్ సుంకారావు, పుల్లన్న, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, పద్మలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎంఈవో ఈశ్వరీబాయి

కొత్త ఫుడ్ స్ట్రీట్‌కు రూపకల్పన

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అవుట్ డోర్ స్టేడియం రహదారిలో కొత్త ఫుడ్‌స్ట్రీట్ ఏర్పాటుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు అలాగే సాయంత్రం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు తాజా రుచులు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకుండా మూవబుల్ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు నగరంలోని మరో 3 చోట్ల కూడా ఫుడ్ స్ట్రీట్స్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహికులు సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ 7386036167, డిప్యూటీ సిటీ ప్లానర్ వెంకటరమణను 8008868734 నంబర్లలో అధికారులను సంప్రదించాలని సూచించారు.



స్టేడియం ఎదురుగా ఏర్పాటు కానున్న ఫుడ్ స్ట్రీట్

నారాయణ పాఠశాలలో ఓరియెంటేషన్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్కూరు బంగ్లాలోని నారాయణ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మాస్టర్ ఒరియంటేషన్ కాంటెస్ట్ బుధవారం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నతనం నుంచే సృజనకు పదును పెట్టే కార్యక్రమాలను నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఏజీఎం రమేష్ కుమార్, ఎస్టీబీసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత రోజ్, ఉస్మానియా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రేష్మా తస్వీర్, క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

భూ సమస్యలను పరిష్కరించండి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పీటీ సాయిప్రదీప్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ నూరుల్ కమర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కలెక్టరేట్ ఈ-సెక్షన్‌లో నెలల తరబడి పలు ఫైల్స్ పెండింగ్ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సెక్షన్ ఉద్యోగస్థులను ప్రక్షాళన చేయాలని కోరారు. పీటీ సాయిప్రదీప్, కుర్ని వెంకటేశ్వర్లు, భగత్, డా.నాగేంద్ర, దర్గాస్వామి పాల్గొన్నారు.



జేసీని కలిసిన బీజేపీ నాయకులు

రీ సర్వే పూర్తి చేయాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3వ విడత రీసర్వేను త్వరగా పూర్తిచేయాలని సీసీఎల్ఏ జయలక్ష్మి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఉదయం విజయవాడ నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సీఎం చంద్రబాబు ఇచ్చిన సూచనల ప్రకారం ఇల్లులేని వారికి ఇంటి సౌకర్యం కల్పించే చర్యలు వెంటనే తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ సీఎం జిల్లాకు వచ్చినప్పుడు ఇచ్చిన వాగ్దానాలపై చర్యలు తీసుకుంటున్నామని, నివేదిక సమర్పిస్తామని తెలియజేశారు. జేసీ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో రెండేళ్లు..



గెలుపొందిన అసోసియేషన్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికై ఏడాది పూర్తయింది. 2024 అక్టోబరు 23న ఏపీఎన్జీవో బలపరిచిన ఎం.లీలావతి ప్యానల్ విజయం సాధించింది. జిల్లా అధ్యక్షురాలిగా ఎం.లీలావతి, కార్యదర్శిగా సి.బంగారి, ఉపాధ్యక్షురాలిగా జి.శాంతిభవాని, కోశాధికారిగా ఎస్.లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులుగా ఎస్.సోమేశ్వరి, యుఎం శాంతిలత, ఏ.ఉమాదేవి, జే.ఉమారాణి, డి.కృష్ణవేణి ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఏడాదిలో డీఎంఈ నుంచి అన్ని విభాగాల్లో నర్సింగ్ సిబ్బందికి డ్యూటీలు వేసేలా ఆర్డర్స్‌ను తెప్పించామన్నారు. అసోసియేషన్ భవనానికి కృషి చేస్తామన్నారు.



వైద్య విద్యను దూరం చేసే కుట్ర

కల్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం కల్లూరు అర్బన్ 31వ వార్డులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలకు అనుమతి ఇచ్చి 5 కళాశాలలను పూర్తి చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కళాశాలలను పూర్తి చేయాలని సవాల్ చేశారు. ప్రభుత్వం కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని త్వరలో గుణపాఠం తప్పదన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న కాటసాని

అమరావతికి రైల్వేలైన్ వేయండి

కల్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి అమరావతికి రైల్వేలైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని న్యూ కర్నూలు జిల్లా డెవలప్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్.తిరుపాల్‌రెడ్డి కోరారు. సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు. నగరం నుంచి అమరావతికి నేరుగా ఇంటర్ సిటీ రైలు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవన్నారు. నేరుగా రైలుమార్గం లేకపోవడంతో డోన్, నంద్యాల మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు

రాజ్యాంగంపై విద్యార్థులకు పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

కోడుమూరు రూరల్, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ విలువలపై పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. హెచ్ఎం అనంతయ్యాయాదవ్ మాట్లాడుతూ విద్యార్థులలో రాజ్యాంగ విలువలు పెంపొందించుట, ప్రజా స్వామ్యం, పరిపాలన, పౌరసత్వంపై అవగాహన కల్పించామన్నారు. ఈ పోటీలతో నాయకత్వం, విమర్శనాత్మక ఆలోచన, చర్చ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, రఫీ, పాండురంగడు, శ్రీనివాసులు, చాంద్, హబీబుల్లా పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి

గూడూరు (కోడుమూరు రూరల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన విద్యార్థిని వడ్డె స్నేహ అనారోగ్యంతో మృతి చెందింది. గూడూరు కేజీబీవీలో ఏడో తరగతి చదువుతోంది. అనారోగ్యం కారణంగా నాలుగురోజుల క్రితం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తర లించగా కోలుకోలేక బుధవారం మృతి చెందింది. తల్లిదండ్రులు శేషన్న, జయలక్ష్మి శోకసంద్రంలో మునిగారు.



వడ్డె స్నేహ(ఫైల్)

మెనూ పాటించకుంటే ఏజెన్సీల రద్దు

సి.బెళగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకుంటే వంట ఏజెన్సీలను రద్దు చేస్తామని ఎంఈవో ఆదాంబాషా హెచ్చరించారు. బుధవారం ముడుమాల, కొత్తకోట, ఈర్లదిన్నె, శింగవరం పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలకు రెండో విడత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామన్నారు.





సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు : జేడీఏ

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి క్వింటానికి రూ.8,130ల ప్రకారం కొనుగోలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశాయని జేడీఏ వరలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలులో 5.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారన్నారు. నాణ్యత కలిగిన పత్తిలో తేమ 8శాతం లోపు ఉంటే రూ.8,130లు, 8 శాతం పైగా ఉంటే రూ.8,060లు, 9 శాతం ఉంటే రూ.7,979లు, 10 శాతం ఉంటే రూ.7,890లు, 11 శాతం రూ.7,818లు, 12 శాతం తేమ ఉంటే రూ.7,797 ప్రకారం ధర వస్తుందన్నారు. మైక్రోనైల్ విలువ నిర్ణీత పరిధి కంటే తక్కువ లేదా ఎక్కువ ఉంటే ప్రతి 0.2 విలువకు రూ.25ల చొప్పున ప్రతి క్వింటానికి తగ్గిస్తారన్నారు. మైక్రోనైల్ విలువ 3 కంటే తక్కువ ఉన్న పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేయరని తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈక్రాప్ చేసుకున్న రైతులు తమ దగ్గరలోని రైతు సేవా కేంద్రాలకు ఆదార్, పట్టాదారు పాసు పుస్తకం నకలు తీసుకెళ్లి తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు.

శనగ విత్తనాలు పంపిణీ

సి.బెళగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పోలకల్లు, ఇనగండ్ల గ్రామాల్లో టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ డాక్టర్ తిమ్మప్ప, ఏవో మల్లేష్‌కుమార్ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఏవో మాట్లాడుతూ విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో రూ.5,912లు చెల్లించి తీసుకోవాలన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● నగర పాలక కమిషనర్ విశ్వనాథ్


కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నిత్యం అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న, పాత భవనాలను గుర్తించాలని, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. నగరంలో మురుగు నిల్వ ఉండకుండా డ్రైనేజీలు, కాలువల్లోని పూడికను వెంటనే తీయించి, వర్షపునీరు పారేలా చూడాలని కోరారు. పోలీసులు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, జలవనరులు, విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నగర పాలక కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో 08518-221847 లేదా 7422992299 నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నామని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

చెన్నకేశవస్వామి విగ్రహం ఊరేగింపు

ఓర్వకల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దీపావళి వేడుకల్లో భాగంగా బుధవారం చెన్నకేశవస్వామి విగ్రహాన్ని ఊరేగించారు. ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పల్లకీలో ఉంచి, మేళతాళాలు, బాణాసంచాతో ఊరేగించారు. టీడీపీ కన్వీనర్ గోవిందరెడ్డి, భక్తులు లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామిని ఊరేగిస్తున్న భక్తులు







లలితా పీఠంలో సామూహిక కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసం ప్రారంభం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో బుధవారం నగరంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సప్తగిరినగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారులకు మధ్యాహ్నం అన్నదానాన్ని కమిటీ అధ్యక్షుడు కేఈ ప్రతాప్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. మేయర్ బీవై రామయ్య, కమిషనర్ విశ్వనాథ్, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, కమిటీ ఛైర్మన్ గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కిడ్స్ వరల్డ్ ఎదురుగా గోశాలలో రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం దీపోత్సవాలను ప్రారంభించారు. జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో కార్తీక మాసం పూజలు నిర్వహించారు.



అన్నదానంలో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

బురదలో ఇరుక్కున్న బస్సు

- రాకపోకలకు అంతరాయం



ఆలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలగవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు బురదలో ఇరుక్కుపోయింది. దాంతో మొలగవల్లి-జొహరాపురం-కొట్టాల గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి బురదమయంగా మారడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ నాయకులు

దేవనకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ, సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటిశెట్టి, వీరశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వారు మాట్లాడుతూ వేలాది రూపాయలతో పంటలు సాగు చేస్తే అధిక వర్షాల కారణంగా రైతులు అప్పులభారంలో కురుకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు మండలంగా ప్రకటించి, ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో నర్సారావు, శేఖర్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దేవనకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ ఘటన దేవనకొండలోని బుధవారం చోటు చేసుకున్నది. పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామానికి చెందిన లాలప్ప, లాల్ బీ దంపతుల కుమార్తె ఫాతిమ (21) పొలం పనుల నిమిత్తం, దేవనకొండలోని తమ చిన్నమ్మ ఇంటికి గత వారం క్రితం వచ్చింది. మంగళవారం సాయంత్రం పొలంలో పనులు ముగించుకొని తమ్ముడితో కలిసి ఫాతిమ బైక్‌పై వస్తుండగా, ప్రమాదవశాత్తు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. రెండేళ్ల క్రితం ఫాతిమకు కోతిరాళ్లకు చెందిన దస్తగిరితో వివాహమైంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీర నాగప్ప నియామకంపై హర్షం

ఆలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కురువ సామాజికవర్గానికి చెందిన వీర నాగప్పను ఎంపిక చేయడంపై ఆలూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కురువ జయరాం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన మాల మల్లేశ్వరస్వామి ఆలయానికి చైర్మన్‌గా కురువలకు ప్రాధాన్యం కల్పించిన టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి శివప్రసాద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి



వినియోగదారులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ

క్రిష్ణగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రదీప్ కుమార్, ఈఈ శేశాద్రి అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్‌సెప్షన్ కార్యక్రమంలో భాగంగా క్రిష్ణగిరి సబ్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసారు. గ్రామాలకు అందుతున్న విద్యుత్ సరఫరా గురించి ఆరా తీశారు. అనంతరం క్రిష్ణగిరిలో విద్యుత్ వినియోగదారులతో సమావేశమయ్యారు.

మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో దీపావళి మరుసటి రోజు బుధవారం రైతులు తెచ్చిన పంట దిగుబడులను వ్యాపారులు సంతోషంగా కొనుగోలు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇది ఆనవాయితీగా కొనసాగుతుంది. రైతులు తెచ్చిన పత్తి, వేరుశనగ, ఇతర పంట ఉత్పత్తులను టెండర్లకు ఉంచారు. సదరు కమీషన్ ఏజెంట్లు రైతులు తెచ్చిన దిగుబడులను వ్యాపారులతో టెండర్ లేకుండా సంతోషదాయకంగా (కుష్ ఖరీదుకు) కొనుగోలు చేశారు.

గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంను అడ్డుకున్న జనం

- తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు
- గంటపాటు స్తంభించిన రాకపోకలు

ఆలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 15 రోజులు గడిచినా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు బుధవారం ఆలూరు-బళ్లారి ప్రధాన రహదారిపై గంట పాటు నిరసన తెలిపారు. ప్రజలు నీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం, డీవైఎఫ్ఐ పార్టీ నాయకులు హనుమంతు, షాకీర్, మైనా మండిపడ్డారు. అదేమార్గంలో వెళ్తున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ప్రజలు అడ్డుకున్నారు. జయరాంకు తాగునీటి సమస్యపై విన్నవించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు సంఘటన స్థలానికి చేరుకుని తాగునీటి సమస్యపై పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. 15 రోజులుగా తాగునీరు సరఫరా



అధికారులు, ప్రజలతో మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

చేయకపోతే ఎలా? అని మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇకమీదట వారానికి ఒకసారి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలి



పత్తికొండలో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇవ్వాలని సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి, వైసీపీ లీగల్ సెల్ నియోజకవర్గ కార్యదర్శి నరసింహయ్య ఆచారి డిమాండ్ చేశారు. బుధవారం న్యాయవాదులు స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనం ఇచ్చేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేలు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, లక్ష్మన్న, రవిప్రకాష్, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. న్యాయవాదులు చేపట్టిన ఆందోళనకు ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య మద్దతు తెలిపారు.

కలుషిత నీరు సరఫరా చేస్తున్నారు..

అధికారుల ఎదుట వాపోయిన మహిళలు

మద్దికెర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోమిన్‌వీధి, నేసేవీధి, రామస్వామి గుడి ప్రాంతాల్లో పంచాయితీ వారు వదిలే నీరు కలుషితం అవుతుందని, ఆ నీరు తాగలేకపోతున్నామనీ కాలనీ మహిళలు వాపోయారు. బుధవారం ఆ ప్రాంతానికి చెందిన మహిళలు స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ రెడ్డితో మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి పంచాయతీ వారు వదిలిన నీటిలో దుమ్మూ దూళితో కలిగిన నీరు వస్తుందని, అది కూడా దుర్వాసనతో వస్తున్నాయని వాపోయారు. మా ప్రాంతాలకు పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారని, అయితే ఉప్పు నీరు కూడా వదులుతున్నారని అన్నారు. తమ కాలనీల్లో ఒక్క బోరు గానీ, బావి కూడా లేదన్నారు. కేవలం పంచాయతీ వారు వదిలే నీటిపైనే ఆధారపడి ఉన్నామన్నారు. మూడు రోజులకు ఒకసారి వదిలే నీటి కోసం వేచి ఉన్నా కూడా తీరా మంచినీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పంచాయతీకి నీటి పన్ను చెల్లిస్తున్నామని, మరీ ఎందుకు మా సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు.



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న మహిళలు

పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో పర్యటించి మీ సమస్యను పరిష్కరించి మంచినీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యే విరూపాక్షిని విమర్శించే స్థాయి లేదు

ఆలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని విమర్శించే స్థాయి దేవనకొండ మండల మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడికి లేదని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మొలగవల్లి రామాంజనేయులు, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ అరికెర వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులకు పెద్దపీట వేశారన్నారు. జిల్లా నుంచి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన గుమ్మనూరు జయరాంను రాష్ట్ర కేబినేట్ మంత్రిగా ఐదేళ్ల పాటు అవకాశం కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క వాల్మీకి వర్గానికి చెందిన వారికైనా మంత్రి



మాట్లాడుతున్న నాయకులు

పదవి ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేను కించపరిచేలా టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, రామచంద్రనాయుడు మాట్లాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు వరుణ్, వీరేష్, శివ, నాగేంద్ర, ఎల్లప్ప పాల్గొన్నారు.

సమస్యలుంటే అసెంబ్లీలో మాట్లాడండి : టీడీపీ

ఆస్పరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో సమస్యలు ఏవైనా ఉంటే అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి మండల టీడీపీ నాయకులు హితవు పలికారు. బుధవారం ఆస్పరిలో మండల టీడీపీ నాయకులు, మాజీ మండల కన్వీనర్ ఎస్. తిమ్మన్న, మాజీ ఎంపీటీసీ బుట్ట చిన్న ఎల్లప్ప, రాజకుమార్ మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన కూటమి ప్రభుత్వ బహిరంగ సభలో వాల్మీకుల సమస్యలను ప్రధానికి విన్నవించినట్లు ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆలూరు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నియోజకవర్గ వాల్మీకుల సమస్యలను అసెంబ్లీకి వెళ్లి ప్రస్తావించాలే గాని బయట ఎంత మాట్లాడినా వృథా అని ఎమ్మెల్యేకు సూచించారు.

ఉద్యోగులకు సన్మానం

ఆస్పరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువతను బుధవారం గ్రామ టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రవిప్రకాష్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రాబునాయుడు సారథ్యంలో నిర్వహించిన మెగా డీఎస్సీ పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు గ్రామం నుంచి ఆరుగురు ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేంద్ర, రంగస్వామి, కౌలుట్లయ్య, శాంతప్ప, నరసప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి శంకరన్

తుగ్గలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఐఏఎస్ శంకరన్ బడుగుల ఆశాజ్యోతి అని ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ రమేష్ అన్నారు. బుధవారం జొన్నగిరిలో మాజీ ఐఏఎస్ అధికారి శంకరన్ 92వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు మరువలేనివన్నారు.

నేడు బోడిబండకు ఎమ్మెల్యే కేఈ రాక

తుగ్గలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గురువారం మండలంలోని బోడిబండ గ్రామానికి రానున్నట్లు సింగిల్ విండో అధ్యక్షుడు అప్పావేణుగోపాల్, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని ఉప్పర్లపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ బోడిబండ ఫక్కీరప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన ధ్యానా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.

మండల సమావేశం వాయిదా

ఆలూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు జె.రంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు హాజరయ్యారు. ఎంపీపీ మినహా వైసీపీకి చెందిన ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాలేదు. 12 గంటల వరకు చూసినా ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో కోరం లేదని సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో మద్దిలేటిస్వామి తెలిపారు.

బసాపురం చెరువుకు తాత్కాలిక మరమ్మతులు

భూమి పూజలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ఆదోని టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే బసాపురం చెరువు ఆనకట్టకు ఏర్పడిన పగుళ్లకు రూ. ఒక కోటి 29 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేయడానికి బుధవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి భూమి పూజను నిర్వహించారు. వారు మాట్లాడుతూ, తాత్కాలిక మరమ్మత్తులను 80 రోజుల లోగా పూర్తి చేయడానికి అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువు ఆనకట్టను పటిష్టంగా రూపొందించేందుకు రూ. 70 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, చైర్‌పర్సన్ లోకేశ్వరి

కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరిగే సమయంలో తాగునీటి సరఫరాలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు, నాగరాజ్, వెంకట చలపతి పాల్గొన్నారు.

సమర్ధవంతంగా అమలు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన హెల్త్ కార్డులను అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సమర్ధవంతంగా అమలు అయ్యేలా చూడాలని ఎస్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ వీరచంద్రయాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెఫరల్ ఆసుపత్రులు హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించడం లేదన్నారు. సమావేశంలో పట్టణ నాయకులు శ్రీనివాసులు, శ్రీరాములు, జయరాం, మధుసూదన్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ వీర చంద్రయాదవ్

కార్తీక మాస పూజలు ప్రారంభం

మద్దికెర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన భక్తుల ఆరాధ్యుడు బుగ్గ సంగమేశ్వరుడి పూజలు కార్తీక మాసం కావడంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం బుగ్గ సంగమేశ్వరంలో మూలవిరాట్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ కార్తీక



మాసం సోమవారం అక్టోబరు 27న, నవంబరు 3, 10, 17 తేదీల్లో కార్తీక సోమవారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే నవంబరు 5వ తేదీన పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా శివప్రీతి దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కార్తీక సోమవారం దేవాలయంలో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.



దివ్యాంగుడి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న జ్యోతి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ : ఆలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన రూ.4,40,547 చెక్కులను బాధితులకు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అందజేశారు. కార్యక్రమంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, కొండ రామాంజనేయులు, ఉచ్చీరప్ప, రామారావు, కృష్ణయాదవ్, జీవన్‌కుమార్, నరసప్ప, వెంకటేష్, సీనప్ప, ప్రకాష్, మారుతి, ıధర్, ఈరన్న, హనుమప్ప, మసాల జగన్, ఉలిగప్ప, గోవిందు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

మద్దికెర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేసేవారంతా జాబ్‌కార్డుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో బుధవారం ఈకేవైసీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్‌కార్డులు పరిశీలించి వారికి ఈకేవైసీ చేయిస్తున్నారని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉపాధి హామీ పథకం ద్వారా ఎటువంటి లబ్ధి చేకూరదన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉద్యాన పంటలు రాయితీ కూడా లభించదన్నారు. మండలంలో 11వేలకు పైగా జాబ్‌కార్డులు ఉన్నాయని, ఇప్పటి వరకు 80 శాతం వరకు ఈకేవైసీ పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఉల్లి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న తహసీల్దార్ గుండాల్ నాయక్

మద్దికెర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు వ్యవసాయ తోటల్లో బావులు, బోర్లు, కాలువలు వర్షాధారానికి సాగు చేసిన ఉల్లి రైతులు కోతకు ముందు, అనంతరం జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ గుండాల్ నాయక్, ఏవో రవి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఉల్లి పంటలు కోతకు ముందు, కోతకు అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలనలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఉల్లి కోతను కోసిన తర్వాత మూడు, నాలుగు రోజుల పాటు పొలంలోనే ఎండబెట్టడం వల్ల ఉల్లిగడ్డలో తేమ శాతం తగ్గి ఉల్లి బాగుంటుందని అన్నారు. ఉల్లి పంటలో ఏఏ పంటలు పిచికారి చేయాలో అధికారులను సంప్రదించి పిచికారీ చేయాలన్నారు. అధికారుల సూచనలతో జాగ్రత్తలు పాటించి ఉల్లిని పంటను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఆనంద్, వీఆర్వో రంగస్వామి, స్వర్ణలత, తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి: డీవైఎఫ్ఐ



రాస్తారోకో చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

దేవనకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని డీవైఎఫ్ఐ అధ్వర్యంలో పత్తికొండ-దేవనకొండ రహదారిపై రాస్తారోకో చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతోందని, మరుగుదొడ్డి నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అన్నారు. నిత్యం రద్దీగా ఉన్న దేవనకొండ బస్టాండ్‌లో సరైన వసతులు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని, ఆరోపించారు. మండల కార్యదర్శి మహేంద్ర, వీరేంద్రనాయుడు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన



ఏవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టులో ఈనెల 3న దసరా బన్నీ ఉత్సవంలో జరిగిన హింసాత్మక ఘటన, తొక్కిసలాటలో తన భర్త, దివ్యాంగుడైన హెచ్.ఆంజనేయ మృతి చెందారని ఆదోనిలోని అరుణ్‌జ్యోతినగర్‌కు చెందిన మాదిగ ఈరమ్మ బుధవారం సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బన్నీ ఉత్సవాన్ని తిలకించేందుకు వెళ్లిన తన భర్త ఇనుప రింగుల కర్రలు, రాళ్లు, మండుతున్న కాగడాలతో జరిగిన ఘర్షణలో తొక్కిసలాట జరిగి, ఆంజనేయ మృతి చెందారని, అతని శరీరంపై గాయాలు అందుకు నిదర్శనమని ఆమె తెలిపారు. అయితే ఆంజనేయ గుండెపోటుతో మరణించినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. దీనిపై హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా పోలీసులు కేసు నమోదు చేయలేదని ఈరమ్మ ఆరోపించారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఐ కార్యదర్శి ఎంపికపై హర్షం

మద్దికెర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య ఎంపిక కావడంపై ఆ పార్టీ మండల కార్యదర్శి నాగరాజు, శాఖా కార్యదర్శులు పెరవలి సుధాకర్, నెట్టికంటయ్య, బొజ్జన, వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ అని, ఈశ్వరయ్య నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఘనంగా కేంద్ర మంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు



పుస్తకాలు, పండ్లు పంపిణీ చేస్తున్న గురురాజ్ దేశాయ్

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు బీజేపీ నాయకులు ఆత్మ నిర్భర్, భారత్ సంకల్ప్ ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజక వర్గాల ఇన్‌చార్జి గురురాజ్ దేశాయ్ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని పూలే అంబేద్కర్ సొసైటీలో అనాథ పిల్లలకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చరణ్, బడేసాబ్, శివ, పద్మా, సుభాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం: తిక్కారెడ్డి



సాతనూరులో మంజునాథ్‌ను పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్య పడవద్దని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. 15 రోజుల క్రితం సాతనూరు చెందిన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ తల్లి లక్ష్మీదేవి మృతి చెందడంతో తిక్కారెడ్డి బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సుధీర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, భరద్వాజ్ శెట్టి, మహాదేవ, వీరారెడ్డి, పంపాపతి, కృష్ణారెడ్డి, నరసింహులు, సోల్మాన్‌రాజు, నీలకంఠ ఉన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో సందీప్ సూచించారు. ఎమ్మిగనూరు ఎంపీడీవో సమావేశ భవనంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 9 రకాల సంకల్పాలను ప్రతి గ్రామ పంచాయతీలో సాధించేందుకు ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల పరిషత్ అధ్యక్షులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కార్యక్రమానికి పెద్దకడబూరు, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని పేదరికంలేని, మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న యాదవ్, ఎంపీడీవో బంగారమ్మ, టీవోలు సుభాన్, రమ్య శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఈ-సిమ్ సర్వీస్ ప్రారంభం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీఎస్ఎన్ఎల్ ఈ సీమ్ సర్వీస్‌ను ప్రారంభించారు. పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ వారు ప్రారంభించగా ఈ సిమ్‌ను మొట్ట మొదట ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి అప్లై చేసుకోగా బీఎస్ఎన్ఎల్ టెక్నిషియన్ గురుప్రసాద్ స్టేషన్‌లోఎస్ఐ మధుసూదన్ రెడ్డిని కలిసి ఈ సిమ్ సేవలను అందించారు. ఈ సిమ్‌ను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవడం ద్వారా యాక్టివెట్ అవుతుందని తెలిపారు. ఈ సిమ్ అనగా సిమ్ లేకుండా క్యూఆర్ కోడ్ సయంతో సిమ్ పని చేస్తుందని తెలిపారు.

ఓటు చోరీతో గద్దెనెక్కిన బీజేపీ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెద్దకడబూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఓటు చోరీతో బీజేపీ గద్దెనెక్కిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనందరాజు, ఆంజినేయ ఆరోపించారు. బీజేపీ ఓటు చోరీ చేసిందని బుధవారం పెద్దకడబూరులో సంతకాల సేకరణను చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ బీజేపీ ఓట్ చోరీకి పాల్పడి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. నాయకులు నాసిర్, జైపాల్, రాజు, జీసీస్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గోనెగండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడం, ఎత్తు కట్టపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకుండా భూమికి తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పచ్చి గడ్డి మొలకెత్తడంతో మూగజీవాలు గడ్డిని మేసేందుకు వెళ్లి విద్యుత్ ప్రమాదం బారిన పడిన ఘటనలు ఉన్నాయి. అలాగే తక్కువ ఎత్తులో ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన చాలా సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తుకట్టపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి రూ.1.97 కోట్ల ఆదాయం

● ఇప్పటి దాకా ఎల్‌ఆర్‌ఎస్‌కు 603 దరఖాస్తులు
● నేటితో ముగియనున్న గడువు

ఎమ్మిగనూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనుమతిలేని వెంచర్లలో వేసిన ప్లాట్లను సక్రమం చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం ఓ చక్కని అవకాశం ఎల్‌ఆర్‌ఎస్ పథకంతో ప్రజలకు కల్పించింది. ఈ ఎల్ఆర్‌స్ పథకం జూలై 27 ప్రారంభమైంది. గురువారం గడువు ముగుస్తుంది. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో ఐదేళ్లలో వైసీపీ హయంలో 65 ఎకరాల్లో దాదాపు 16 చోట్ల అక్రమ వెంచర్లు వేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడటమే కాకుండా స్థలాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితి ఉండడంతో స్పందించిన కూటమి ప్రభుత్వం అక్రమ వెంచర్లను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా కల్పించింది.

ఎల్‌ఆర్‌ఎస్‌కు 603 దరఖాస్తులు

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు వివిద ప్రాంతాల్లో ఉన్న 603 మంది స్థలాల యజమానులు తమ స్థలాలను సక్రమం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మున్సిపాలిటీకి రూ. 1.97 కోట్ల ఆదాయం సమకూరింది. ఎల్‌ఆర్‌ఎస్ పథకం ప్రకటించినప్పటి నుంచి మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది అక్రమ వెంచరు దారులు 130 మందికి నోటీసులు ఇవ్వటంతో పాటు పట్టణంలో పలు ప్రాంతాల్లో స్థల యజమానులకు అవగాహన కల్పించారు. అలాగే మున్సిపల్ లైసెన్సు సర్వేయర్లుకు కూడా అవగాహన



మున్సిపల్ కార్యాలయం

కల్పించి స్థల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. 34 మంది లైసెన్సుడ్ సర్వేయర్లు ఉండగా వారి ద్వారా అడపదడపా దరఖాస్తులు రాగా జగదీష్ అసోసియేట్స్ నుంచే 230 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆ రెండు వెంచర్ల నుంచి స్పందన కరువు

పట్టణంలోని ఎద్దుల మార్కెట్ రోడ్డు, వెంకటాపురం కాలనీల సమీపంలో వేసిన వెంచర్ల యజమానుల నుంచి స్పందన కరువయింది. ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగుస్తున్న స్పిన్నింగ్ మిల్లు దగ్గర వేసిన ఓ వెంచరు నుంచి కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే రాగా మైనార్టీ కాలనీ రోడ్డులో వేసిన వెంచర్‌నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవటం గమనార్హం. టౌన్‌ప్లానింగ్ అధికారులు పలు దఫాలుగా నోటీసులు ఇచ్చిన ఏమాత్రం స్పందించకపోవటంతో ఆ స్థలాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేసి స్థలాల క్రయవిక్రయాలు



పట్టణ శివారులో అక్రమంగా వేసిన వెంచర్

జరగకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు



ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ అవకాశం గురువారం ముగుస్తుంది. గడువు ముగిసిన తరువాత ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోకుండా ఉన్న అక్రమ లే అవుట్లపై కొరడ ఝులిపిస్తాం. ఒక నోటీసు ఇచ్చిన తరువాత స్పందించని వారిపై రెండో నోటీసుతో కోర్టులో కేసులు వేసేలా చర్యలు ఉంటాయి. ఇప్పటికీ ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే.. నేడు ఒక్కరోజే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్థలాలను సక్రమం చేసుకోవాలి.

రాజేశ్, టీపీవో, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ

శ్రీమఠంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

● కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

మంత్రాలయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో శ్రీమఠాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. బుధవారం గోశాలను సందర్శించి సతీసమేతంగా గోపూజ నిర్వహించారు. పుష్కరిణి కారిడార్‌లను అభివృద్ధి పనులను తిలకించారు. సాయంత్రం పరిమళ షాపింగ్ కాంప్లెక్స్ వెనక భాగంలో శ్రీమఠం ఈఈ సురేష్‌కోణాపూర్, ఏఈ బద్రీనాథ్ ఆధ్వర్యంలో పీఠాధిపతితో కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి రూ. 10కోట్లతో మూడంతస్తుల డార్మెంటరీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాహుల్ జోడో యాత్రలో మంత్రాలయానికి వచ్చి దర్శించుకోవడంతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చామని తెలిపారు. రాజా ఎస్ అప్రమేయాచార్, కృష్ణకౌశిక్, ఏఏవో మాధవశెట్టి, టీడీపీ నాయకులు పన్నగ వెంకటేశ్, పూజారి వ్యాస రాజాచార్, అమర్నాథరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, భరద్వాజ్‌శెట్టి పాల్గొన్నారు.



పీఠాధిపతితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కర్ణాటక ప్రజాప్రతినిధులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

దర్శించుకున్న తిక్కారెడ్డి: గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి దర్శించుకున్నారు. ఎస్ఐ శివాంజల్, టీడీపీ నాయకులు నరసింహ, యేబు, సుంకప్ప, నర్సారెడ్డి, నాగరాజు, గురురాజు ఉన్నారు.

కర్ణాటక ప్రజాప్రతినిధులను కలిసిన రాంపురం రెడ్డి సోదరులు



కర్ణాటక, తెలంగాణ ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న రాంపురం రెడ్డి సోదరులు

మంత్రాలయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, చిన్ననీటిపారుదల శాఖ మంత్రి బోసేరాజు, రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్, తెలంగాణ క్రీడ, పశుసంవర్థక శాఖ మంత్రి వాకిట శ్రీహరి మంత్రాలయానికి వచ్చారు. అలాగే ఎమ్మెల్సీలు బసన్నగౌడు బదాలీ, వసంతకుమార్, బసవరాజుపాటిల్, మాన్వీ, మస్కీ, రాయచూరు రూరల్, సింధనూరు ఎమ్మెల్యేలు హంపయ్యనాయక్, బసవన్నగౌడు, దద్దాల బసవన్నగౌడు, హంపన్నగౌడు కూడా వచ్చారు. వీరిని రాంపురంరెడ్డి సోదరులు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, గుర్రెడ్డి భీమిరెడ్డి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం పద్మనాభతీర్థ గెస్ట్‌హౌస్‌లో మంత్రులతో భేటీ అయ్యారు. సీవీ విశ్వనాథ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మురళిరెడ్డి, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఉన్నారు.

విద్యుత్ సరఫరాపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ ప్రసన్న కుమార్

ఎమ్మిగనూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నతపాఠశాలలో 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యుదుత్పత్తి, సరఫరాపై ఏఈ ప్రసన్నాంజనేయులు అవగాహన కల్పించారు. బుధవారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు 132-33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను హెచ్‌ఎం నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ ఎలా సరఫరా చేస్తారు?, లేఅవుట్ ఎక్స్‌ప్లనేషన్ సిరీస్ అండ్ ప్యారలర్ కనెక్షన్ స్టెప్ అప్, డౌన్, ట్రాన్స్‌పార్మర్లపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఈరన్న, ఒకేషనల్ ఉపాధ్యాయిని వెంకటలక్ష్మి, సతీశ్, గోపాల్, సత్యం, శ్రీహరి, వంశీ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న కాలప్ప

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాలప్ప డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి నేతన్నకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. లేకపోతే ఈ నెల 28న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. ఏడాదికి రూ.32 వేల ప్రకారం నేతన్న నేస్తం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో వరదలు, తుఫానులు వచ్చినప్పుడు నేతన్నలు నెలలు తరబడి ఉపాధి కోల్పోతున్నారని, మగ్గం ఇతర సామగ్రి భారీ వర్షాలకు తడిచి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు, శీను, రాముడు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల అభివృద్ధికి అధికారులు, నాయకులు అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే అభివృద్ధికి సాధ్యమవుతుందని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. బుధవారం కోసిగిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో ఎంపీపీ పెండేకల్లు ఈరన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధిపై ఎంపీటీసీ, సర్పంచులతో పలు శాఖల అధికారులు చర్చించారు. ముఖ్యంగా వలసలు నివారించి విద్యార్థులను వలస వెళ్లకుండా చూడాలని ప్రజా ప్రతినిధులు అధికారులకు తెలియజేశారు. మండలంలో అత్యధికంగా వలసలు వెళ్తున్నారనీ, గ్రామాలు ఖాళీ అవుతున్నాయన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు నాడిగేని అయ్యన్న, మార్కెట్ యార్డు ఛైర్మన్ చింతలగేని నర్సారెడ్డి, వ్యవసాయాధికారి వరప్రసాద్, ఏపీవో ఖాళిక్, ఎంఈవో బాలయ్య, మాలిక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, కాత్యాయని, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

● గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుబాల, గార్లదిన్నె, కందనాతి, మసీదుపురం, మల్కాపురం తదితర గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బం దులు తప్పడం లేదు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రతి కార్యక్రమంలో సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం, తాగునీటి సరఫరా చేసే కాంట్రాక్టర్ల అలసత్వంతో ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో కొళాయిలకు మోటార్లు ఏర్పాటు చేసుకుంటుండడంతో కేవలం కొంతమందికి మాత్రమే నీరు అందుతోంది. మిగతా ప్రజలు తాగునీటి కోసం సుదూర ప్రాంతాల్లో ఉన్న బోరు, బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏనుగుబాల గ్రామంలో బిందెలను క్యూలో పెట్టిన ప్రజలు

ప్రజా సమస్యలపై పోరాడాలి: సీఐటీయూ

మంత్రాలయం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై పోరాటానికి ప్రతి కార్యకర్త పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం మంత్రాలయం పాఠశాల ఆవరణలో సీఐటీయూ మండల నాయకుడు జయరాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25,26 తేదీల్లో సీఐటీయూ 13వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులకు పార్టీ విస్తరణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజల సమస్యలపై నిత్యం పోరాటానికి కృషి చేస్తూ ఉండాలని కోరారు. సీఐటీయూ నాయకులు విశాలాక్షి, భీమేశ్వరి, ప్రకాశ్, లక్ష్మన్న, కల్యాణి పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక: మంత్రాలయం సీఐటీయూ నూతన మండల కమిటీని ఎంపిక చేసినట్లు సీఐటీయూ నాయకుడు జయరాజు తెలిపారు. మండల కమిటీ కన్వీనర్‌గా భీమేశ్వరి, కో కన్వీనర్లుగా విశాలాక్షి, పుష్పలత, ప్రాణేష్, లక్ష్మన్న, కమిటీ సభ్యులుగా స్వప్న, భారతి, జానకి, కల్యాణి, ఉమామహేశ్వరి, ప్రసంగి, ప్రకాశం, మారెప్ప, సురేశ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కౌతాళం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25, 26వ తేదీలలో కర్నూలులో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. కౌతాళంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆ సంఘము మండల అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలను 8 నుంచి 12గంటలు పనిదినాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు మల్లయ్య, వీరన్న, వలి, ఆశాకార్యకర్తలు, వీఆర్‌ఏలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



పోస్టరును విడుదల చేస్తున్న ఈగల్ సెల్ ఎస్ఐ, ఉపాధ్యాయులు

గోనెగండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అలాంటప్పుడే శారీకర, మానసిక వికాసం వస్తుందని కర్నూలు ఈగల్ సెల్ ఎస్ఐ సుజన్‌కుమార్, హెచ్‌ఎం నాగభూషణం, లక్ష్మయ్య అన్నారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మత్తుపదార్థాలతో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవిత విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల నడవడికపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ కోసం పాటుపడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ సెల్ సిబ్బంది రమేష్, శక్తి టీం నాగన్న, పీడీ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి

ఎమ్మిగనూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోనెగండ్ల సర్కిల్ పరిధిలో చేపడుతున్న రోడ్డు, సర్కిల్ బ్యూటిఫికేషన్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. బుధవారం గోనెగండ్ల సర్కిల్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ బ్యూటిఫికేషన్, రహదారులను రూ. కోటి నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి శంకరన్ కృషి

ఎమ్మిగనూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ శంకరన్ ఆదివాసి, దళితుల సంక్షేమం, అభ్యున్నతికి బాటలు వేశారని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం అన్నారు. ఎస్ఆర్ శంకరన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఏఎస్ శంకరన్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుమాల రాజు, ఆంథోని, రాజా రమేష్, సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

● విజేతలకు బహుమతుల ప్రదానం

మంత్రాలయం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. తండా గ్రామంలో దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఎం. తండా జట్టు విజయం సాధించింది. కరుణం రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం కరుణం గోపిస్వామి, తిరుమలరావు ఏర్పాటు చేసిన నియోజకవర్గ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం విజయవంతంగా ముగిసింది. కరుణం గోపిస్వామి చేతులమీదుగా మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో నారాయణ నాయక్, అమ్రేష్‌నాయక్, రామచంద్రనాయక్, రాజానాయక్, కన్వీనర్లు సురేష్‌నాయక్, శేఖర్‌నాయక్, కృష్ణనాయక్, నగేష్‌నాయక్, రవి నాయక్,మంగప్పనాయక్, లోక్‌నాయక్ పాల్గొన్నారు.